www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 3 మార్చి 2024
5
పశ్చిమ గోదావరి



99 శాతం ఇకెవైసి పూర్తి

జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 99.2 శాతం ఇకెవైసి పూర్తి చేశామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రబీ సీజన్లో 2.22 లక్షల ఎకరాలు ఇ-క్రాప్ నమోదు చేసి, రైతుల ఇకెవైసి 99.2 శాతం పూర్తి చేశామని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీల్లో భాగంగా రబీ సీజన్‌కు సంబంధించి ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించినట్లు తెలిపారు. గ్రామసభలు కూడా నిర్వహించనున్నామని తెలిపారు. ముసాయిదాపై వచ్చిన అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

రసవత్తరం.. రణరంగం

జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారింది. జిల్లాలో పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీల నేతలు పాకులాడుతున్నారు. టిడిపి, జనసేన కూటమి అభ్యర్థుల జాబితా ప్రకటనతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అయితే టిక్కెట్లు ఆశించి దక్కని వారు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా రాజకీయం రణరంగంగా మారింది. ఈ నేపథ్యంలో సీనియర్ నేతల పలకరింపులు, బుజ్జగింపులతో జిల్లాలో రాజకీయం రసవత్తరంగా మారింది.



పట్టు కోసం రాజకీయ పార్టీల నేతల పాకులాట

ప్రతిపక్ష కూటమికి తప్పని అసంతృప్తి సెగలు

ఎన్నికల్లో పోటీ చేస్తామనే ప్రకటనలతో ప్రకంపనాలు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర రాజకీయాల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ఒక ప్రత్యేకత ఉంది. ఎన్నికల్లో ఈ జిల్లాలో ఏ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందో ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకొస్తుందనేది నానుడి. దీంతో రాజకీయ పార్టీలు కూడా గోదావరి జిల్లాలపైనే ఎక్కువ కేంద్రీకరిస్తూ ఉంటాయి. 2014 ఎన్నికల్లో టిడిపి ఈ జిల్లాలో క్లీన్ స్వీప్ చేసి రాష్ట్రంలో అధికారం చేపట్టింది. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి సైతం ఎక్కువ స్థానాలను గెలుపొంది జిల్లాను కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాపై పట్టు సాధించేందుకు రాజకీయ పార్టీలు తహతహలాడుతున్నాయి. టిడిపి, జనసేన, వైసిపి తమ ప్రాబల్యాన్ని ఎన్నికల్లో చూపించేందుకు సిద్ధమయ్యాయి. ప్రతి అడుగు ఆచితూచి వేయడంతోపాటు ప్రత్యర్థులను మట్టి కరిపించేందుకు ఎవరికి వారే వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే వైసిపి జిల్లాలో ఉన్న సిట్టింగ్ ఎంఎల్‌ఎలకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు అవకాశం కల్పించింది. వారు ప్రజాక్షేత్రంలో వివిధ కార్యక్రమాలు చేస్తూ ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగుతున్నారు. టిడిపి, జనసేన కూటమి తరపున ఏడుగురు అభ్యర్థులను ప్రకటించారు. ఈ నియోజకవర్గాల్లో ఆది నుంచి టిడిపికి పట్టు ఉండడంతో ఈసారి మళ్లీ ఆ పార్టీ అభ్యర్థులే ఇక్కడ బరిలోకి దిగుతున్నారు. అయితే జనసేన నుంచి ఒక్క స్థానాన్ని కూడా ప్రకటించకపోవడంతో కేడర్ అయోమయానికి గురైంది. 2014 ఎన్నికల్లో రెండు ఎంపీ స్థానాలు, 14 ఎంఎల్‌ఎ స్థానాలను టిడిపి గెలుచుకుంది. అప్పట్లో జిల్లాలో వైసిపి అంత ప్రాబల్యం చూపించలేకపోవడంతో కనీసం బోణీ కూడా చేయలేదు. 2019 ఎన్నికల్లో రాష్ట్రమంతా వైసిపి పవనాలు వీయడంతో జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు, 12 ఎంఎల్‌ఎ స్థానాలను గెలుచుకుంది. పాలకొల్లు, ఉండి స్థానాలు టిడిపి సాధించింది. కొన్ని నియోజకవర్గాల్లో జనసేన ఆ పార్టీలకు ధీటుగా గట్టి పోటీ ఇచ్చిందేగాని ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఈసారి జరగనున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడిగా పోటీకి దిగుతున్న సందర్భంలో పూర్వవైభవాన్ని సాధించాలని గట్టి సంకల్పంతో ఉన్నారు. సంక్షేమ పథకాలే ప్రధాన అస్త్రంగా ముందుకు సాగుతున్న అధికార పార్టీ వైసిపి కూడా గతం మాదిరిగానే జిల్లాలో తమ బలాన్ని, ప్రాబల్యాన్ని చూపించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది.

అసంతృప్తులు.. నిరసన సెగలు

టిడిపి, జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితా ప్రకటనతో జిల్లాలో ఆశావహుల అసంతృప్తులు వెల్లువెత్తాయి. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకటశివరామరాజు మధ్య ఉండి స్థానంపై మొదట నుంచి రగడ జరుగుతుంది. అయితే సిట్టింగ్ ఎంఎల్‌ఎ మంతెన రామరాజును ఉండి అభ్యర్థిగా టిడిపి అధిష్ఠానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శివరామరాజును బుజ్జగించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు, అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఫోన్ ద్వారా సంప్రదించినప్పటికీ శివ వాళ్లతో మాట్లాడేందుకు నిరాకరించినట్లు తెలిసింది. ఎంఎల్‌ఎ మంతెన రామరాజు తన సతీమణిని తీసుకుని శివరామరాజు స్వగ్రామమైన కలగంపూడిలో ఇంటికి వెళ్లినప్పటికీ శివరామరాజు వాళ్లకు అందుబాటులో లేకుండా వెళ్లిపోయారని ప్రచారం సాగుతుంది. కనీసం తనను సంప్రదించకుండా టిడిపి అవమానించిందని, ఎంఎల్‌ఎ రామరాజుకు ఎన్నికల్లో సహకరించే ప్రసక్తే లేదని శివరామరాజు చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. తాను ఎన్నికల్లో పోటీ చేసి తీరుతానని, తన నిర్ణయాన్ని త్వరలో వెల్లడిస్తానని శివ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

2019 నుంచి తణుకు టిక్కెట్‌ను జనసేన నేత విడివాడ రామచంద్రరావు ఆశించి పార్టీ కార్యక్రమాల్నీ తానే నిర్వహించారు. అయితే చివరి నిమిషంలో జనసేన టిక్కెట్‌ను విడివాడకు ఇవ్వకుండా తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి చెందిన పసుపులేటి వెంకటరామారావుకు కేటాయించారు. అక్కడ ఆయన ఓటమి అనంతరం జనసేనను వీడి వేరే పార్టీలో చేరారు. అప్పటి నుంచి నేటి వరకు విడివాడ మాత్రం జనసేనలోనే కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలను భుజస్కంధాలపై వేసుకున్నారు. వారాహి యాత్రలో భాగంగా తణుకులో జరిగిన సభలో విడివాడ రామచంద్రరావుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పి రానున్న ఎన్నికల్లో విడివాడ ఇక్కడి నుంచే పోటీ చేస్తారని ప్రకటించారు. అయితే ఇక్కడ టిడిపి అభ్యర్థిగా మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేరును ప్రకటించడంపై విడివాడ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భీమవరంలో కూడా అసంతృప్తి సెగలు చాపకింద నీరులా సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏడు స్థానాలు టిడిపికి కేటాయించడంతో మరో ఏడు లేదా ఐదు స్థానాలు జనసేనకు కేటాయిస్తున్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది. రెండో జాబితా ప్రకటించాక జిల్లాలో రాజకీయ పరిస్థితులు ఏవిధంగా ఉంటాయో అంతుచిక్కని పరిస్థితి ఏర్పడింది.

మాస్ వార్నింగ్‌ల కలకలం

వైసిపి అధినేత, సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు అభ్యర్థులకు ఇచ్చిన మాస్ వార్నింగ్‌లు వారిని కలవరపెడుతున్నాయి. టిక్కెట్ వచ్చింది అభ్యర్థులు ఆనంద పడటం కాదని, ఇగోలన్నీ పక్కనపెట్టి మాజీలను కలుపుకుని ప్రజలతో మమేకమవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. పనితీరు తేడా వస్తే అభ్యర్థులను మారుస్తామని హెచ్చరికలు జారీ చేశారు. వైసిపి ఎంఎల్‌ఎలు, ఇన్‌ఛార్జులంతా రానున్న ఎన్నికల్లో అభ్యర్థులు కారని, పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా ఎన్నికల ముందు ప్రకటిస్తామని టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి చెప్పిన వ్యాఖ్యలు వైసిపిలో గుబులు పుట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

346 మంది విద్యార్థులు గైర్హాజరు

భీమవరం : ఇంటర్ సెకండియర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 13,763 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 13,508 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1437 మందికిగాను 1346 మంది హాజరయ్యారు. మొత్తం జిల్లావ్యాప్తంగా 346 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా విద్యార్థుల హాజరు శాతం 97.7గా నమోదైంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

డిఇఒ వెంకటరమణ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 3వ తేదీ ఆదివారం నిర్వహించబోయే పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి ఆర్.వెంకటరమణ పిలుపునిచ్చారు. స్థానిక బిఆర్.అంబేద్కర్ సెంటర్ వద్ద పల్స్‌పోలియో ప్రచార ర్యాలీని శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అంబేద్కర్ సెంటరు నుండి ప్రకాశం చౌక్ మీదుగా తహాశీల్దారు కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా డిఇఒ వెంకటరమణ మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందును తప్పక వేయించాలన్నారు. జిల్లాలో 1,315 బూత్‌లు, 5,260 మంది అధికారులు, సిబ్బందిని నియమించారన్నారు. ఐదేళ్లలోపు ఉన్న లక్షా 85 వేల మంది చిన్నారులకు పోలియోచుక్కలు వేయాలని గుర్తించామన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు మరింత చొరవ తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది కలసికట్టుగా పనిచేసి నూరుశాతం పోలియో చుక్కలు మొదటి రోజునే వేసేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ భానునాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవ సుధాలక్ష్మి, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ఎస్. కీర్తి కిరణ్, ఐసిడియస్ అధికారి బి.సుజాతా రాణి, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగ సాయి, వైద్యాధికారులు, పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ అధికారులు, వైద్య సిబ్బంది, స్వాతి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



ర్యాలిని ప్రారంభిస్తున్న డిఇఒ వెంకటరమణ

ఖర్చుల నివేదికల్లో నిబంధనలు పాటించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చుల నివేదికలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఎఫ్ఎస్‌టి (ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్), విఎస్‌టి (వీడియో సర్వే లైన్స్ టీమ్), వివిటి (వీడియో వ్యూయింగ్ టీమ్), ఎస్ఎస్‌టి (స్టాటిస్టిక్ సర్వే లైన్స్ టీం)లకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో కలెక్టర్‌తోపాటు డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల, ఎఎస్‌పిలు భీమారావు, ఇటివి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలుత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల ఖర్చుల రకాలు, టీములు నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీ అభ్యర్థి రూ.95 లక్షలు, ఎంఎల్‌ఎ అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేస్తే ఆయా అభ్యర్థులు అర్హత కోల్పోతారన్నారు. అన్ని బృందాలు వారికి అప్పగించిన విధంగా అభ్యర్థుల ఖర్చుల వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అభ్యర్థులు వారి ఖర్చుల నివేదికలను మూడుసార్లు వ్యయ పరిశీలకులకు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా సరే రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తుంటే పట్టుకోవాలని, రూ.10 వేల విలువ చేసే బహుమతులు, వివిధ రకాల వస్తువులుగానీ ఉంటే సీజ్ చేయాలన్నారు. స్టార్ క్యాంపెయినర్ వద్ద ఒక లక్ష రూపాయల వరకు ఉంచుకునేందుకు అనుమతి ఉందన్నారు. పోలింగ్‌కు మూడు, నాలుగు రోజులకు ముందు ఎక్కువ క్రైమ్స్ జరిగే అవకాశం ఉంటుందని, చాలా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సి విజిల్ యాప్ కూడా ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. ఈ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన 30 నిమిషాల్లోపే ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఆ ప్రాంతానికి చేరుకుంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ఎవరూ అతీతులు కారని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో సున్నితమైన ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల మాట్లాడుతూ జిల్లా సరిహద్దుల్లో ఐదు చెక్‌పోస్టులు, 14 సర్వేలైన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడా డబ్బు, మద్యం, మాదకద్రవ్యాలు అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, ఎఎస్‌పి వి.భీమారావు, సెబ్ ఎఎస్‌పి ఎటివి.రవికుమార్, ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, డిఎస్‌పిలు డిఎస్ఆర్‌విఎస్ఎన్.మూర్తి, వి.నారాయణస్వామిరెడ్డి, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి కెసిహెచ్.అప్పారావు, ఇఆర్‌ఒలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాక్సోపై అవగాహన తప్పనిసరి

మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్

ప్రజాశక్తి - ఏలూరు

పోక్సో చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులతో పోక్సో చట్టం, బాధితులకు పరిహారం, ఎన్‌డిపిఎస్ చట్టాలపై అవగాహనా సదస్సును జిల్లా ఎస్‌పి కార్యాలయంలోని సమావేశపు హాలులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథి మొదటి జిల్లా అదనపు జడ్జి జి.రామగోపాల్ మాట్లాడుతూ పోక్సో చట్టం అనేది లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేదని తెలిపారు. 2012 నవంబరు 14 నుండి ఈ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. శారీరకంగా, మానసికంగా చిన్నారులను వేధిస్తే నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చన్నారు. మాదకద్రవ్యాల కేసుల్లో నేర పరిశీలన, కోర్టుల్లో కేసుల దాఖలు తదితర అంశాలపై పోలీస్ అధికారులకు అవగాహన కల్పించారు. మారుతున్న చట్టాలపైనా అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్గి ఉండాలన్నారు. అప్పుడే బాధితులకు త్వరగా న్యాయం అదేలా చేయవచ్చని తెలిపారు. 8వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్ మాట్లాడుతూ కోర్టుల్లో సమన్లను, వారెంట్లను ఎన్ స్టెప్ అనే ఆన్‌లైన్ విధానం ద్వారా అమలు చేస్తున్నారని, రాష్ట్రంలో మొదటిసారి ఏలూరులోని ఎస్‌సి, ఎస్‌టి కోర్టు, మొబైల్ కోర్టుల్లో దీనిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదా వరి జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లలో 25 మంది కానిస్టేబుల్స్‌ను నియమించామని, వీరు ప్రతిరోజూ ఆన్‌లైన్ విధానంలో నోటీసులను, వారెంట్లను పంపుతారన్నారు. తద్వారా తక్కువ సమయంలో బాధితులకు న్యాయం అందేలా ఈ పైలెట్ ప్రాజెక్టును రూపొందించారని తెలిపారు. ఏలూరు జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఫోక్సో చట్టంలోని అంశాలను పోలీస్ అధికారులు, సిబ్బంది తెలుసుకుని బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. రోజురోజుకీ పోక్సో కేసులు పెరుగుతున్నాయన్నారు. శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి మాట్లాడుతూ బాలిక కిడ్నాప్‌కు గురైనప్పుడు తల్లిదండ్రుల మనోవ్యధను గుర్తించి ఓదార్చి ధైర్యం చెప్పి కేసు నమోదు చేయాలన్నారు. తొలుత చట్టాల అవగాహన కార్యక్రమాన్ని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, 8వ అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్‌కుమార్, శాశ్వత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎ.మేరీ గ్రేసీకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సదస్సులో ఎఎస్‌పి జి.స్వరూపరాణి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి

లోక్‌అదాలత్‌లో రాజీకి 400 కేసులు గుర్తింపు

భీమవరం సివిల్ జడ్జి అప్పలస్వామి

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 16న నిర్వహించబోయే జాతీయ లోక్‌అదాలత్‌లో 400 కేసులను రాజీకి గుర్తించినట్లు భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి అన్నారు. స్థానిక కోర్టులో క్రిమినల్ కేసులు, రెవెన్యూ, మున్సిపల్ కేసులపై రాజీకి తీసుకున్న చర్యలపై పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి అప్పలస్వామి మాట్లాడుతూ రాజీకి వీలున్న 400 క్రిమినల్ కేసులను గుర్తించామని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ఇప్పటికే ఇరుపక్షాలకు నోటీసులిచ్చి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు డిఎస్‌పి వి.నారాయణస్వామిరెడ్డి తెలిపారు. సివిల్ కోర్టులో పెండింగులో ఉన్న ల్యాండ్ ఎక్విజిషన్ కేసులు, భీమవరం మున్సిపాల్టీకి సంబంధించిన కేసుల రాజీకి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిప్యూటీ తహాశీల్దార్ దుర్గ, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఆర్.దేవసేనలకు సూచనలిచ్చారు. ఆకివీడు టౌన్ ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ, భీమవరం రూరల్ సిఐ వై.సత్యకిషోర్, ఎజిపి యు.వరప్రసాద్ పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత జగన్‌దే

ఇళ్ల స్థలాల హక్కు పత్రాల పంపిణీ సభలో డిప్యూటీ సిఎం కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు చేయడంతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలో జగనన్న ఇళ్ల స్థలాల హక్కు పత్రాలను మంత్రి కొట్టు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గడిచిన నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల కాలంలో వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ ప్రకటించిన నవరత్నాలనే కాకుండా ప్రకటించని హామీలను సైతం అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. వాలంటీరు, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారన్నారు. వాలంటీరు, సచివాలయం వ్యవస్థలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు వంటివి దేశవ్యాప్తంగా తీసుకు వచ్చేందుకు కేంద్రం ఆలోచించడం మనకు ఎంతో గర్వకారణమన్నారు. రాష్ట్రానికి సిఎం జగన్ ఎంత అవసరమో తాడేపల్లి గూడెం నియోజకవర్గానికి తాను అంతే అవసరమ న్నారు. 3515 మహిళలకు మంత్రి కొట్టు, కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా జగనన్న ఇళ్ల స్థలాల హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్య, ఎఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, మాజీ ఎంఎల్‌ఎ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసల కనక సుందరరావు, పార్టీ టౌన్ ప్రెసిడెంట్ గుండు బోగుల నాగులు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, సిజిఎఫ్ కమిటీ మెంబర్ కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలన్నా, హక్కులు నిలబడాలన్నా ఐక్య పోరాటాల ద్వారానే సాధ్యమని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మికుల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జిల్లా కౌన్సిల్ సమావేశం గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాయ్ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులకు నష్టం చేసే చట్టాలు తీసుకొస్తున్నారని విమర్శించారు. బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పులు చేసి కార్మికులకు తీవ్ర నష్టం చేసిందన్నారు. దేశవ్యాప్తంగా లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేసిందని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కూడా అమ్మడానికి ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలంలో నూతన పరిశ్రమలు స్థాపించలేదని, నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. మోడీ ప్రభుత్వ విధానాలతో విసుగెత్తిన రైల్వే కార్మికులు సమ్మె ప్రకటించారన్నారు. రైల్వే కార్మికుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. రానున్న రోజుల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కార్మికవర్గానికి పిలుపుచ్చారు. మోడీ తెచ్చిన చట్టాలకు రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు మద్దతు పలకడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మోడీకి మద్దతు తెలుపుతున్న పార్టీలను కూడా ఓడించాలని పిలుపుచ్చారు. ఈ సమావేశంలో సిఐటియూ జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, డి.కళ్యాణి, ఎస్.రంగారావు, ఎ.అజయకుమారి, కె.ఝాన్సీ, జి.రామకృష్ణ, సూరిబాబు, ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్

పెరుగుతున్న హీటు.. నేతలకు తప్పని ఫీట్లు..!

వేసవి ఎండలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. అదే సమయంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రాజకీయాలు సైతం అదే స్థాయిలో హీటెక్కడంతో ఆశావహులైన నేతలకు ఫీట్లు తప్పడం లేదు. టిక్కెట్లు ఖరారైన వారు ప్రచార వ్యూహాలపై కసరత్తు చేస్తుండగా, ఇంకా అభ్యర్థిత్వాలు ఖరారు కానివారు అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక టిక్కెట్ దక్కదని స్పష్టమైన ఆశావహులు ఆగ్రహంతో రగిలిపోతూ పక్కచూపులు చూస్తున్నారు. వెరసి ఎండల వేడి పెరగడంతో తల్లడిల్లుతున్న ప్రజలకు నేతల ఫీట్లు నవ్వు తెప్పిస్తుండటం విశేషం.

అధికార పార్టీ వైసిపి అభ్యర్థులు దాదాపు ఖరారైనట్లేనని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే ఏలూరు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గాలకు కొత్త సమన్వయ కర్తలను నియమించారు. చింతలపూడిలో సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఎలిజాకు బదులు కె.విజయరాజును సమన్వయకర్తగా నియమించారు. మిగిలినచోట్ల దాదాపు సిట్టింగ్ ఎంఎల్‌ఎలకే టిక్కెట్లు ఖరారవుతాయనే ప్రచారం ఉంది. పాలకొల్లు, ఉండిలోనూ నియోజకవర్గ సమన్వయకర్తలుగా ఉన్నవారినే బరిలోకి దింపుతారా, లేక మార్చుతారా అనే సస్పెన్స్ అయితే కొనసాగుతోంది. ప్రధానంగా చింతలపూడిలో ఎలిజా మార్పు టీ కప్పులో తుపానులా సమసిపోయినట్లు కన్పిస్తోంది. అయితే విజయరాజుకు మద్దతుగా ఎలిజా ఎన్నికల్లో ప్రచారం చేస్తారా, లేదా అనేది వేచిచూడాల్సి ఉంది. ఇక ఉండి నుంచి పివిఎల్.నర్సింహరాజునే వైసిపి అభ్యర్థిగా బరిలోకి దిగుతారా, లేక టిడిపి నుంచి టిక్కెట్ దక్కని మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజును పార్టీలో చేర్చుకుని బరిలోకి దింపుతారా అనే ఉత్కంఠ ఇంకా కొనసాగుతోంది. లేక శివ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగితే వైసిపి నుంచి శివ అభ్యర్థిత్వమే ఖరారయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రతిపక్ష టిడిపి, జనసేన కూటమి తరపున ఉమ్మడి జిల్లాలో 14 స్థానాలకుగాను ఏడు స్థానాల్లో టిడిపి అభ్యర్థులను ప్రకటించారు. వీటిలో ఏలూరు, తణుకుల్లో జనసేన నుంచి టిడిపి అభ్యర్థులకు ప్రతికూలత తప్పని పరిస్థితి కన్పిస్తోంది. ఇక్కడ టిక్కెట్ ఆశించి భంగపడ్డ జనసేన నేతలు రెడ్డి అప్పలనాయుడు, విడివాడ రామచంద్రరావు మౌనంగా ఉంటారా, లేక స్వతంత్రులుగా బరిలోకి దిగుతారా అనేది తేలాల్సి ఉంది. మిగిలిన ఏడు స్థానాలపై మాత్రం ఎడతెగని ఉత్కంఠ సాగుతోంది. భీమవరం నుంచి పవన్ పోటీ చేస్తారని తొలుత భావించినా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభలోనూ దానిపై



ఎటువంటి ప్రకటనా చేయలేదు. ప్రస్తుత సమాచారం ప్రకారం కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పవన్ పోటీ చేస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భీమవరం నుంచి టిడిపి అభ్యర్థి బరిలో ఉంటారా లేక జనసేన అభ్యర్థి బరిలో ఉంటారా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది. టిడిపి మాజీ ఎంఎల్‌ఎ అంజిబాబును టిడిపి నేతలతో కాకుండా ప్రత్యేకంగా ఆయన ఇంటికి వెళ్లి పవన్ కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పవన్ భీమవరం నుంచి పోటీ చేయకపోతే జనసేన అభ్యర్థిగా అంజిబాబు బరిలో ఉంటారని తెలుస్తోంది. నరసాపురం టిక్కెట్ జనసేనకు ఇస్తే బొమ్మిడి నాయకర్ పోటీ చేస్తారని అంతా భావించారు. అయితే ఆ పార్టీలోకి కొత్తగా మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు చేరడం, జెండా సభలో ప్రాధాన్యతివ్వడం పలు చర్చలకు తావిచ్చింది. ఇక్కడ నాయకర్ బరిలో ఉంటారా లేక కొత్తపల్లి రంగంలోకి దిగుతారా అనే చర్చ ప్రస్తుతం సాగుతోంది. తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, కైకలూరు, పోలవరం స్థానాలపైనా అటు జనసేన, ఇటు టిడిపి ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. బిజెపికి పొత్తులో జిల్లాలో టిక్కెట్ కేటాయిస్తే కైకలూరు కావొచ్చనే ప్రచారం ఉంది. దెందులూరు నుంచి బరిలోకి దిగేది టిడిపినే అయినా చింతమనేని ప్రభాకర్ అభ్యర్థిత్వం ప్రకటించకపోవడం చర్చకు తావిచ్చింది. ఈ క్రమంలో ఓపక్క అభ్యర్థిత్వాలు, మరోపక్క ఓట్ల బదిలీపై జనంలో విస్తృత చర్చమాత్రం సాగుతోంది.

టిక్కెట్ ఇచ్చే పార్టీనే రఘురామ పార్టీ..!

గత ఎన్నికల్లో వైసిపి నుంచి నరసాపురం ఎంపీగా గెలిచిన కనుమూరి రఘురామకృష్ణంరాజు కొద్దిరోజుల్లోనే ఆ పార్టీకి పంటి కింద రాయిలా మారి రెబల్‌గా మారారు. ఆయన ఇటీవల వైసిపికి రాజీనామా చేశారు. ఇటీవల తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభలో తానే ఏ పార్టీలో చేరలేదంటూనే తనదైన శైలిలో మాట్లాడారు. ఆపై రానున్న ఎన్నికల్లో తాను నరసాపురం ఎంపీ అభ్యర్థిగా ఈ కూటమి నుంచి బరిలోకి దిగుతానని, అయితే ఏ పార్టీ అనేది మరికొద్దిరోజుల్లో చెబుతాననడం, ఆ సమయంలో వేదికపై టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ గుసగుసలాడుకోవడం చర్చనీయాంశమైంది. గతంలోనూ రఘురామకృష్ణంరాజు టిడిపి, బిజెపి తరపున రెండు నామినేషన్లు దాఖలు చేసి వార్తల్లోకెక్కారు. బిజెపితో పొత్తు కుదిరితే నరసాపురం స్థానం బిజెపికి కేటాయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆ నేపథ్యంలో రఘురామ పొత్తులో ఈ సీటు ఏ పార్టీకి దక్కుతుందో ఆ పార్టీలో చేరి టిక్కెట్ దక్కించుకోవాలనే యోచనలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఏదేమైనా నామినేషన్ల ఘట్టం పూర్తయ్యే వరకూ ఎవరు ఏ పార్టీలో ఉంటారో చెప్పలేని పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

వాడివేడిగా పాలకొల్లు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

దిగమర్రు ఛానల్‌లోకి వచ్చే తాగునీటి కాలువలోకి మురుగు నీరు, వాడకపు నీరు వస్తుందని పాలకొల్లు మండల సమావేశంలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొల్లు మండల పరిషత్ సమావేశం మండల ఉపాధ్యక్షుడు పడవల సునీల్‌బాబు అధ్యక్షతన శనివారం వాడీవేడిగా జరిగింది. తాగునీటి సమస్యపై ఇరిగేషన్ ఎఇ శ్రీనివాస్ మాట్లాడుతూ పలుమార్లు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఆగర్రు సెక్రటరీ బి.ఆనంద్‌బాబు మాట్లాడుతూ కాలువలపై కలుపు మందులు చల్లించడం వల్ల జలాలు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మట్టపర్తి అనుపమ, వైస్ ఎంపిపి నాగేశ్వరరావు, ఎంఇఒ జి.వీరాస్వామి, సూపరింటెండెంట్ గోవిందరాజు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ సమావేశంలో పల్స్‌పోలియోపై అవగాహన ఫ్లెక్సీని ఆవిష్కరించారు.

ఓటు హక్కు బలమైన ఆయుధం

ప్రజాశక్తి - పాలకోడేరు


అవగాహనా ర్యాలీ

ఓటు హక్కు ప్రతి ఒక్కరికీ బలమైన ఆయుధమని పాలకోడేరు డ్వాక్రా ఇన్‌ఛార్జి ఎపిఎం భారతి అన్నారు. పాలకోడేరు మండల సమైక్య భవనంలో ప్రకృతి వ్యవసాయం, పల్స్ పోలియో, స్వీప్ ఆక్టివిటీ (ఓటు పై అవగాహనా కార్యక్రమం) శనివారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో సమావేశం నిర్వహించి ఓటు హక్కు పై గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో పాటు మానవహారం, ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ సరైన సమయంలో సరైన వ్యక్తిని ఎన్నుకోవడం ద్వారా అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఆచంట

పట్టణ ప్రాంతాలకు ధీటుగా పల్లె ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపిపి సూర్యకుమారి అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.3 లక్షలతో వల్లూరు సాయిబాబా ఆలయం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు వల్లూరులో సుమారు రూ.30 లక్షల నిధులతో చేపట్టిన వివిధ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. సర్పంచి నేలపూడి బేబీరామ్మోహన్‌రావు మాట్లాడుతూ రానున్న కాలంలో ఎంపిపి నిధులతో వల్లూరు గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు సుబ్బారావు, వార్డు మెంబర్ ఉండవల్లి త్రినాధరావు, పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులు ఈ క్రాప్ జాబితా పరిశీలించుకోవాలి

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన 2023-24 సంవత్సరానికి సంబంధించి రైతుల ఈ క్రాప్ జాబితాను పరిశీలించుకోవాలని మండల వ్యవసాయాధికారి బిన్నిబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోషల్ ఆడిట్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఈ జాబితాను ఆర్‌బికెల వద్ద అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ జాబితాలో తమ వివరాలు లేని రైతులు సంబంధిత ఆర్‌బికెల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. రైతులకు సంబంధించి ఈ క్రాప్ నమోదు కాకపోయినా, సాగుచేసే వరి రకం తప్పుగా నమోదు చేసినా సరిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

బాధితులకు చీఫ్ విప్ ప్రసాదరాజు పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని గొంది గ్రామానికి చెందిన శీలబోయిన శ్రీను అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు శనివారం పరామర్శించారు. సరిపల్లి గ్రామానికి చెందిన బెల్లంకొండ ధనరాజు, పట్టణంలోని 16వ వార్డుకు చెందిన షేక్ మస్తాన్ శనివారం మృతి చెందారు. వారి మృతదేహాలను ప్రసాదరాజు సందర్శించి నివాళులర్పించారు.

'వివేక హత్యలో జగన్ పాత్ర తేల్చాలి'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సిఎం జగన్ సొంత చిన్నాన్న వైఎస్.వివేకానంద హత్యపై జగన్ పాత్ర ఉందన్న అనుమానాలు వివేక కుమార్తె డాక్టర్ సునీత తెలియజేయడంపై వెంటనే విచారణ చేపట్టాలని టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వివేక కుమార్తె డాక్టర్ సునీత చేస్తున్న పోరాటానికి టిడిపి మద్దతు ఉంటుందన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ జగన్ తాను సిఎం అవ్వడం కోసం తనసొంత బాబాయిని హత్య చేయించారనే వాస్తవాలను దాస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు హిందూపూర్ సుబ్రహ్మణ్యరాజు, గూడూరు సుబ్బారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రేవు వెంకన్న, కవురు పృథ్వీశంకర్ పాల్గొన్నారు.

వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి - ఆచంట

కరోనా విపత్తు సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వాలంటీర్లు విశేష సేవలందించారని వాలంటీర్ ఆచంట నియోజకవర్గ కన్వీనర్ కర్రి అనురాధ రెడ్డి అన్నారు. మండలం వల్లూరు, కరుగోరిమిల్లి, భీమలాపురం గ్రామాల్లో వాలంటీర్లతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనురాధ రెడ్డి హాజరై మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందించడంలో వాలంటీర్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, వైసిపి గ్రామ ఇన్‌ఛార్జి ముత్యాల నాగేశ్వరరావు, మొల్లేటి రామకృష్ణ పాల్గొన్నారు.

విశ్రాంతి భవనం ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో ప్రతి పేదవానికీ మహాప్రస్థానం విశ్రాంతి భవనం అందుబాటులో ఉంటుందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలో 14వ వార్డు బరియల్ గ్రౌండ్ వద్ద రూ.2.91 కోట్లతో నిర్మించిన మహాప్రస్థానం విశ్రాంతి భవనం, అస్థికలు భద్రపరిచే, వాచ్‌మెన్ గతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో గోదావరి నది ఒడ్డున ఉన్న శ్మశానవాటికను నరసాపురం పురపాలక సంఘం, సిఎం స్పెషల్ ఫండ్ రూ.2.91 కోట్ల నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నరసాపురం మున్సిపాలిటీ మహాప్రస్థానం (శ్మశానవాటిక) రేపటి నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు ఏడిది కోట సత్యనారాయణ, (వైకెఎస్) కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు షేక్ బుల్ మస్తాన్, కౌన్సిలర్లు బర్రి జయరాజు, కె.కృష్ణవేణి, కస్తూరి ఇందిరా, మల్లాడి బుజ్జి, మోకరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక శశి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ కళాశాలలో వార్షిక క్రీడా మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ హాజరై మాట్లాడారు. కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్ మాట్లాడారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ అభినందించారు.

'వైసిపిలోకి సూర్యప్రకాష్.. జనసేనకు నష్టం లేదు'

పెనుగొండ : చేగొండి సూర్యప్రకాష్ వైసిపిలోకి చేరడంతో జనసేనకు నష్టం నుంచి ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మగలదాస్ దానయ్య అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సూర్యప్రకాష్ సొంత ప్రయోజనాల కోసమే పార్టీ మారారన్నారు. ఈ కార్యక్రమంలో కొండేటి శ్రీనివాస్, గుర్రాలు సూరిబాబు, నంబూరు విజయ, ఆకుల శివప్రసాద్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌డిఒ కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కలెక్టర్ సుమిత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ పాల్గొన్నారు.

ఒపిఎస్ పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పోడూరు

ఒపిఎస్ పునరుద్ధస్తానని హామీ ఇచ్చినవారికే తమ ఓటు అని యుటిఎఫ్ నాయకులు చెప్పారు. ఓట్ ఫర్ ఓపిఎస్ కార్యక్రమంలో భాగంగా శనివారం యుటిఎఫ్ పోడూరు మండల శాఖ ఆధ్వర్యంలో పలు నినాదాలను వివిధ ప్రాంతాల్లో గోడలపై రాసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్, పోడూరు మండలాధ్యక్షులు దాసరి క్షేమమూర్తి, ప్రధాన కార్యదర్శి కేతా నాగరాజు, సహాధ్యక్షులు కె.పెద్దిరాజు, కోశాధికారి సిహెచ్.త్రినాధ్, కార్యదర్శులు డివివి.ప్రసాద్, వైవి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీపట్నం భూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఆయన శనివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పలువురు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను అందించారు. కాళీపట్నం పడమరలో సర్పంచి కవురు సావిత్రి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

రక్తదాత భగవాన్ యువతకు ఆదర్శం

ప్రజాశక్తి - నరసాపురం

రక్తదానం చేయడంలో యువతకు భగవాన్ ఆదర్శమని ప్రభుత్వాసుపత్రి ఐసిటిసి మెడికల్ కౌన్సిలర్ జె.జేసుప్రసాద్ అన్నారు. నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో జేసు ప్రసాద్ సమక్షంలో పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఆదరణ ట్రస్ట్ ఛైర్మన్ బొడ్డు కృష్ణ భగవాన్ 71వ సారి రక్తదానం చేశారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక కడకట్ల జనతా ఛారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వంగపండు రామ్మోహనరావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత షుగర్ రక్త పరీక్ష శిబిరం నిర్వహించారు. లయన్ పి.విశ్వేశ్వరరావు ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని తాడేపల్లిగూడెం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమములను అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో మొత్తం 114 మందికి పరీక్షలు నిర్వహించారు.

'ఆదిత్య'లో సైన్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఆకివీడు

భావితరానికి యువ శాస్త్రవేత్తలను అందించడమే తమ లక్ష్యమని ఆ దిశగానే తాము విద్యార్థులను సామాజిక దృక్పథంతో తయారు చేదిస్తున్నామని ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఉండ్రమట్ల సాంబశివరావు అన్నారు. ఆదిత్య విద్యా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సంస్థ విద్యాలయ ప్రాంగణంలో విద్యార్థులచే విద్య విజ్ఞాన (సైన్స్ ఎగ్జిబిషన్) ప్రదర్శన నిర్వహించారు.

'చిరంజీవిని సిఎంగా ప్రకటించాలి'

ప్రజాశక్తి - నరసాపురం

నీతి, నిజాయితీలకు మారుపేరు సేవగుణం కలిగిన పద్మ విభూషన్ చిరంజీవిని సిఎంగా ప్రకటించిన పార్టీకి తన మద్దతు ఉంటుందని నరసాపురం సర్పంచుల ఛాంబర్ మాజీ అధ్యక్షుడు, యర్రంశెట్టిపాలెం గ్రామ మాజీ సర్పంచి కూనపరెడ్డి వీరవెంకటవిజయరంగారావు అన్నారు. మండలంలోని యర్రంశెట్టిపాలెం గ్రామంలోని ఆయన స్వగృహంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరంజీవిని ఏ పార్టీ ముఖ్యమంత్రిగా ప్రకటిస్తుందో ఆ పార్టీకి తన ఆస్తిని అమ్మి విరాళం ఇస్తానన్నారు. చేగొండి హరిరామ జోగయ్య, ముద్రగడ పద్మనాభం, దాసరి రాము, కాపు కుటుంబ సభ్యులు, బడుగు బలహీనులందరూ చిరంజీవి సిఎం అయ్యేలా చేసే పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని తూర్పు తాళ్లు పంచాయతీ సైపువారిమెరకలో ఆకుల సత్యనారాయణకు చెందిన తాటాకిల్లు శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. బాధితులకు శ్రీసూర్య విద్యా సంస్థల సెక్రట, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, అకాడమిక్ అడ్వైసర్ బి.రామచంద్రరెడ్డి, అధ్యాపక బృందం రూ.పది వేలు ఆర్థిక సాయం చేశారు.

భారీగా పెరిగిన పంచాయతీ ఆదాయం

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు నగర పంచాయతీ ఆదాయ వనరుల్లో ప్రధాన భాగమైన మార్కెట్ ఆశీలు వసూళ్లకు నిర్వహించిన వేలం పాటల్లో ఆదాయం భారీ స్థాయిలో పెరిగింది. ఈ వేలం పాటల్లో ప్రధానమైనది మార్కెట్ పాట. ఈ పాట గతేడాది రూ.73.20 లక్షలు ఉండగా ఈ ఏడాది రూ.80.82 లక్షలు పలికిందది. ఒక మార్కెట్ ఆశీలు వసూలే రూ.7.62 లక్షలు పెరిగింది. కాగా బుధవారం సంత మార్కెట్ పాట గత సంవత్సరం రూ.3.6 లక్షలు ఉండగా ఈ ఏడాది రూ.3.24 లక్షలు పలికింది. కబేళాకు రూ.33 వేలు పలికింది. గతేదాడి కన్నా రూ.2,500 అదనంగా పలికింది. దీంతో నగర పంచాయతీ ఆదాయం భారీగా పెరిగినట్లు అవుతుంది.

నివాస గ్రామాల్లోనే ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

టిడిపి, జనసేన ప్రభుత్వంలో పేదలు, మహిళలకు నివాస గ్రామాల్లోనే అన్ని సౌకర్యాలతో ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. మండలంలోని శివదేవుని చిక్కాల, బల్లిపాడు గ్రామాల్లో 18వ రోజు శనివారం జరిగిన ఇంటింటి పాదయాత్రలో ఆయన మాట్లాడారు. బల్లిపాడు ఎస్‌సి కాలనీలో ఆయన రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం అక్కడి నుంచే పాదయాత్ర కొనసాగించనున్నారు

విద్యార్థులకు విద్యాసామగ్రి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని అనాకోడేరు డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భీమవరం డిఎన్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో జామెట్రీ బాక్స్, ఎగ్జామ్ ప్యాడ్, రెండు పెన్నులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమానికి పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ గూడపాటిమిల్టన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా భీమవరం డిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బిఎస్.శాంతకుమారి హాజరై మాట్లాడారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ సంస్కృతం, హిందీ, తెలుగు పరీక్షలు జరిగాయి. నరసాపురంలో ఆదిత్య, శ్రీ వైఎన్ డైమండ్ జూబ్లీ, శ్రీసూర్య, ఉమెన్స్, గౌతమి, భాస్కరా కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్దఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఉండి : యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 152 మంది విద్యార్థులకు 150 మంది హాజరవ్వగా ఇద్దరు గైర్హాజరయ్యారని ప్రిన్సిపల్ పెద్దిరాజు తెలిపారు. ఒకేషనల్ పరీక్షకు 17 మందికి 17 మంది హాజరయ్యారని తెలిపారు.

పెనుగొండ : ఎస్‌వికెపి, పితాని జూనియర్ కళాశాలలో 532 మందికి 507 హాజరవ్వగా 25 మంది గైర్హాజరయ్యారు. వాసవి మహిళా కళాశాలలో 165 విద్యార్థులకు 158 హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు. విశ్వతేజ జూనియర్ డిగ్రీ కళాశాలలో 290 విద్యార్థులకు 283 హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు.

ఆచంట : ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. 83 మంది విద్యార్థులకు ముగ్గురు గైర్హాజరయ్యారని డిఇ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ అప్పారావు తెలిపారు. ఒకేషనల్‌కు సంబంధించి 33 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరయ్యారని తెలిపారు.

నేడు పల్స్‌పోలియో జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల మూడో తేదీ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి.మహేశ్వరరావు అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నిర్వహించే పల్స్ పోలియో ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. 3వ తేదీన పోలియో చుక్కలు వేసుకొని పిల్లలకు 4, 5 తేదీల్లో సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తామన్నారు.

ఇరగవరం : ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేయించాలని, పోలియో రహిత సమాజాన్ని స్థాపించడానికి అందరూ సహకరించాలని ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి క్రాంతిరెడ్డి అన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు మండల పరిధిలో దాదాపు 41 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నరసాపురం :పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ అన్నారు. నరసాపురం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు పల్స్‌పోలియోపై హెల్త్, అంగన్‌వాడీ, మున్సిపల్ సిబ్బంది శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

పాలకోడేరు : పల్స్ పోలియో కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేయాలని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి సిహెచ్.రంగంనాయుడు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహనా ర్యాలీని శనివారం నిర్వహించారు.

పాలకొల్లు :స్థానిక బంగారు వారి చెరువు గట్టు ఏరియాలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడారు.

మరోసారి ఆశీర్వదించి గెలిపించండి

ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల



రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి తనను గెలిపించాలని నియోజకవర్గ ప్రజలను ఎంఎల్‌ఎ మంతెన రామరాజు కోరారు. టిడిపి, జనసేన కూటమిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి, జనసేన ఉండి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు కలిసి కాళ్ల మండలంలోని 21 గ్రామాలను సందర్శించి ఇరు పార్టీ నాయకులతో శనివారం ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంతెన రామరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో కేటాయించిన నిధులను సైతం వైసిపి ప్రభుత్వం రద్దు చేయడంతో అభివృద్ధి కుంటు పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో అధికారంలోకొచ్చే టిడిపి, జనసేన కూటమితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. చంద్రబాబు నాయుడు రెండేళ్ల క్రితమే సిట్టింగ్ ఎంఎల్‌ఎ టిక్కెట్‌ను ఖరారు చేశారని చెప్పారు. బొండాడ గ్రామం పెదపేటలో చర్చి నిర్మాణానికి మందపాటి రామారావు జ్ఞాపకార్థంగా రూ.లక్ష విరాళాన్ని పార్టీ గ్రామ అధ్యక్షులు మందపాటి కృష్ణమూర్తి అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, కలవపూడి సర్పంచి గేదల జాన్, బోస్ కాలనీ సర్పంచి మంతెన శ్రీనివాసరాజు, ఉప సర్పంచి బూడి పర్రాలు, జనసేన నాయకురాలు గవర లక్ష్మి, గడి రాము, అరేటి దిలీప్ కుమార్, అభిరుచి కాశీరాజు, కఠారి నరసింహరాజు, సాగిరాజు సోమరాజు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్ ప్రొఫెసర్ సుబ్బారావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కస్టమర్ సర్వీసెస్‌లో నూతన విధానం వల్ల తక్కువ ఖర్చుతో తక్కువ సంఖ్యలో ఉద్యోగులతో అత్యుత్తమ సర్వీసులు అందించవచ్చని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముద్రగడ వెంకటసుబ్బారావు తన పరిశోధనల ద్వారా వెల్లడించారు. సుబ్బారావు చేసిన పరిశోధనకు ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు తెలిపారు. సామానుయలకు ఉపయోగపడే మంచి ప్రాజెక్టు చేపట్టిన డాక్టర్ ఎంవి.సుబ్బారావును కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంతవర్మ ఘనంగా సత్కరించారు.

స్వర్ణాంధ్ర అధ్యాపకుడికి డాక్టరేట్

నరసాపురం :మండలంలోని సీతారాంపురంలోని కళాశాలలో సిఎస్ఇ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎస్.ఉమామహేశ్వరరావుకు ఆంధ్ర యూనివర్సిటీ నుంచి డాక్టర్ డిగ్రీ పొందారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పివిజిడి.ప్రసాద్‌రెడ్డి పిహెచ్‌డి గైడ్‌గా వ్యవహరించారు. ఉమామహేశ్వరరావును పలువురు అభినందించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలే తన కుటుంబమని, వారి చిరునవ్వే తనకు సంతృప్తి ఇస్తుందని, ప్రజల కోసం రాజకీయాల్లో ఉండి భార్యాపిల్లలను, వ్యాపారాన్ని పట్టించుకోలేకపోయానని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక లూథరన్ పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ రాజు పాల్గొన్నారు.

వీరవాసరం : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లకు చెందిన లబ్ధిదారులకు శనివారం రిజిస్ట్రేషన్ పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఆచంట :అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మంజూరు చేసిందని ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. స్థానిక రామేశ్వరస్వామి సత్రంలో 816 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన చేసిన పట్టాలను ఆయన శనివారం అందించారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని చింతపర్రులో ఇళ్ల పట్టాలను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ అందించారు. అనంతరం వెంకటాపురంలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

'పవన్‌కళ్యాణ్‌కు రాజ్యాధికారం కోసం పోరాడతా'

ప్రజాశక్తి - పాలకొల్లు

తాను చచ్చేంతవరకు జనసేనతోనే ఉంటానని ఇప్పటికే ప్రకటించానని, పవన్‌కల్యాణ్ రాష్ట్రాధికారంలో భాగస్వామి అయ్యేవరకు తన పోరాటం ఆగదనే తాను చేసిన ప్రకటనకే ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని కాపు సేన నేత చేగొండి హరిరామ జోగయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జనసేన అధిపతి ఎదుగుదలకు నిష్కలంగా తాను చేస్తున్న ప్రయత్నాన్ని కొందరు జన సైనికులు ప్రశ్నిస్తున్నారని, అటువంటి వారిని టిడిపి కోవర్టులుగా అభివర్ణిస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించేవారికి 15 రోజులకోసారి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సూర్యనారాయణమూర్తి తెలిపారు. జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లలో ఈ నెల 16వ తేదీ నుంచి మార్చి ఒకటో తేదీ వరకు ప్రయాణించినవారి వారి టిక్కెట్లు శనివారం ఉదయం 11 గంటలకు తాడేపల్లిగూడెం బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సమక్షంలో లక్కీ డీప్ నిర్వహించారు. ఈ లక్కీ డీప్ విజేతలకు తాడేపల్లిగూడెం జివి మాల్ షాప్, సెలబ్రేట్ వారి ఆర్థిక సౌజన్యంతో బహుమతులను అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నుంచి రూ.12,700కు అయోధ్య, కాశీ యాత్ర ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయకుమార్, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

6న గణపవరం మండల సమావేశం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎంఎస్.సుధాకరరావు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిపి దండు వెంకటరామరాజు అధ్యక్షత వహిస్తారని చెప్పారు.

In the Court of the Hon'ble VII Addl. District Judge Cum Family Judge, Eluru
O.S. No. 42/2021

Between:
Sri. Ghanta Gangadhara Rao ...*Plaintiff*
AND
Sri. Bandaru Venkata Satyanarayana ...*Defendant*

పై నంబరు దావాలో Defendant అయిన Sri. Bandaru Venkata Satyanarayana, S/o. Krishna Murthy, R/o. D.No. 2-16, Gundugolanugunta Village, D.Tirumala Mandal, W.G.Dist., అను వారికి నోటీసులు అమలు కొరకు **ది. 07-03-2024 వాయిదా అయివున్నది.** సదరు వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10.30 గం॥లకు** స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

E.SRINIVASA BABU
A.RAVI KUMAR
Advocates, Eluru
ఏలూరు
01-2-2024

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 4528 of 2022

Between :
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager(Law)&Authorized Officer, ...Plaintiff
AND
Sri.A.Sudhakar ...Defendant

To
Sri.A.Sudhakar, S/o.S.CH.Bose, Aged about 42 Years, Occ: Employee, R/o. H.No.35-42-7/1, Flat No.3, Station Road, Tanuku, West Godavari, A.P-534211.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,90,664-35ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 07-03-2024.

In case of your failure to attend before the Court on **07-03-2024** at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)

T.Bhagya Raju
& Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village,
HYDERABAD-50.

CHANGE OF NAME

I SHAIK ZAINAB, W/o. IBRAHEEM MOHAMMED ALI SHAIK, Resident of D.No. 3-44, Ramalayam Street, Near Post Office, Sanivarapupeta, Eluru, Eluru District, Andhra Pradesh - 534003. I have changed my name from **GUDAPATI KARUNA KUMARI** (Old) to **SHAIK ZAINAB** (New), As per affidavit dated 02-03-2024 for future references.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరులో
I.A. 30/2023 in O.S. 260/2011

Between:
కండవల్లి ప్రిసిల్లా (డైడ్), వగైరా **-పిటీషనర్/ ప్లెయింటిఫ్**
మరియు
కండవల్లి పద్మాస్‌కుమార్ (డైడ్), వగైరా **-రెస్పాండెంట్స్/ డిఫెండెంట్స్**

To:
R-30: కండవల్లి శాంతిపాల్, W/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-31: కండవల్లి రఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-32: కండవల్లి కెఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.

పై నంబరు పిటీషన్‌లో పైన ఉదహరించిన R30, R31, R32 రెస్పాండెంట్సు హాజరు నిమిత్తం ది. 18-3-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున 30, 31, 32వ రెస్పాండెంట్సు వాయిదా రోజు అనగా **ది. 18-3-2024న ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడల 30, 31, 32వ రెస్పాండెంట్సు పరోక్షంలో I.A. తీర్మానించబడును.

ఏలూరు **బి.శ్రీలక్ష్మి,** అడ్వకేట్
02-03-24 ఏలూరు, సెల్: 8019442114

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరులో
I.A. 29/2023 in O.S. 260/2011

Between:
కండవల్లి ప్రిసిల్లా (డైడ్), వగైరా **-పిటీషనర్/ ప్లెయింటిఫ్**
మరియు
కండవల్లి పద్మాస్‌కుమార్ (డైడ్), వగైరా **-రెస్పాండెంట్స్/ డిఫెండెంట్స్**

To:
R-30: కండవల్లి శాంతిపాల్, W/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-31: కండవల్లి రఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-32: కండవల్లి కెఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.

పై నంబరు పిటీషన్‌లో పైన ఉదహరించిన R30, R31, R32 రెస్పాండెంట్సు హాజరు నిమిత్తం ది. 18-3-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున 30, 31, 32వ రెస్పాండెంట్సు వాయిదా రోజు అనగా **ది. 18-3-2024న ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడల 30, 31, 32వ రెస్పాండెంట్సు పరోక్షంలో I.A. తీర్మానించబడును.

ఏలూరు **బి.శ్రీలక్ష్మి,** అడ్వకేట్
02-03-24 ఏలూరు, సెల్: 8019442114

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరులో
I.A. 28/2023 in O.S. 260/2011

Between:
కండవల్లి ప్రిసిల్లా (డైడ్), వగైరా **-పిటీషనర్/ ప్లెయింటిఫ్**
మరియు
కండవల్లి పద్మాస్‌కుమార్ (డైడ్), వగైరా **-రెస్పాండెంట్స్/ డిఫెండెంట్స్**

To:
R-30: కండవల్లి శాంతిపాల్, W/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-31: కండవల్లి రఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.
R-32: కండవల్లి కెఫా, S/o. late ప్రభుకిరణ్, గమ్ బజార్, ఏలూరు.

పై నంబరు పిటీషన్‌లో పైన ఉదహరించిన R30, R31, R32 రెస్పాండెంట్సు హాజరు నిమిత్తం ది. 18-3-2024వ తేదీన వాయిదా అయివున్నది. కావున 30, 31, 32వ రెస్పాండెంట్సు వాయిదా రోజు అనగా **ది. 18-3-2024న ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడల 30, 31, 32వ రెస్పాండెంట్సు పరోక్షంలో I.A. తీర్మానించబడును.

ఏలూరు **బి.శ్రీలక్ష్మి,** అడ్వకేట్
02-03-24 ఏలూరు, సెల్: 8019442114

IN THE COURT OF THE MACT CUM II ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT :: HYDERABAD, TELANGANA
O.P.NO. 94 OF 2023

BETWEEN :
Kaddakal maheshwari & Others ... Petitioners
AND
Ravi Kumar & Others ... Respondents

To,
1. Ravi Kumar, Age : 36 Years, Occ. Goods Carriage Driver, R/o. 3-1-767, P.P. Road, Bhimavaram ...R1

Whereas the above named Petitioners have filed the above O.P. against you and another for grant of compensation under the M.V. Act.

Please take notice that the above O.P. stands posted to **14-03-2024** for your appearance, you are required to appear before Hon'ble Court at **10:30** am on the above date either in person or through and advocate, failing which the matter will be decided exparte

// BY ORDER OF THE COURT //

C. SATISH KUMAR REDDY
Advocate
Plot No. 36/1 # 3-125/36,
Shanthinagar Colony, Uppal,
Hyderabad -39
Cell : 9440039530